# 'దమ్ మారో దమ్'

రచన :
శ్రీ ఎ. ఎమ్. అయోధ్యారెడ్డి

మద్రాసు టు హైదరాబాదు జనతా ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలను పరామర్శించుకుంటూ వేగంగా ముందుకు దూసుకుపోతోంది. మనిషి స్మృతిపథంలోకి వచ్చి వచ్చి గతంలోకి వెళ్ళిపోయే అనుభవాల్లా చెట్లూ చేమలూ గుట్టలు మిట్టలు తరుమబడిన మందల్లా వెనక్కి వెళ్ళిపోతున్నాయ్.

'టక్-టక్-టకా-టక్'

అయుపదంగా రైలుబండి చేస్తున్న చప్పుడు మనిషి హృదయాన్ని సుషుప్తావస్థలోకి కొంపోయే క్రమబద్ధమైన సంగీతం.

ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో ప్రయాణంచేస్తూవున్న డాక్టరు హరిబాబు అంతరంగం అత్యంత మనోహరంగా వుంది. కిటికీలోంచి అగుపిస్తున్న ప్రకృతి నగ్న సౌందర్యం అతణ్ణి ఎంతగానో ఉత్తేజితుణ్ణి చేస్తోంది. మనసంతా విరిసిన ఉద్యానవనంలా వుంది.

అప్పుడు సమయం ఉదయం 7 గంటలు కావస్తోంది. తూర్పుదిశగా ఉదయిస్తూన్న బాలభానుని నునులేత కిరణాలు ప్రకృతిమాతను మృదువుగా స్పర్శిస్తూ తమ గాఢ స్నేహాన్ని చాటుతున్నాయ్.

ఎఱ్ఱగా, గుండ్రని అందమైన, ముద్దొస్తున్న సూర్య బింబాన్ని తిలకించగానే హరిబాబు స్మృతిపథంలో అందమైన మంజుల నగుమోము మందహాసం చిందిస్తూ, సాక్షాత్కరించింది.

'మంజుల! ఓహ్!! ఎంత చక్కటి పేరు, పేరుకు తగినట్టి ముగ్ధమోహన రూపం' అంతటి సౌందర్యరాశిని మానవలోకంలో అందులోనూ తన మరదలిగా సృష్టించినదేవునికి మనసారా కృతజ్ఞతలు తెలుపుకున్నాడతను. 'ఇప్పుడేంచేస్తుందో మంజుల' బహుశ నా రాక కోసం కన్నులు కాయలుకాసేలా ఎదురుచూస్తూ వుండవచ్చు. తన్ను చూడగానే మంజు ముఖం ఎలా వికసిస్తుందో! అమెరికానుండి నాకోసం ఏం తెచ్చావుబావా? అంటే తను అపురూపంగా మంజులకోసం కొనితెస్తున్న అమెరికన్ ట్రాన్సిస్టర్ ఆమె చేతిలో పెడతాడు. మంజుకు అమెరికన్ ట్రాన్సిస్టర్ మీద మోజు అధికం. అందుకే తను అమెరికానుంచి తిరిగి ఇంటికి వచ్చేప్పుడు అది తీసుకురమ్మని కోరింది. హరిబాబు మెత్తగా నవ్వుకుంటూ సూట్ కేస్ లోంచి ట్రాన్సిస్టరు తీసి ఆన్ చేశాడు.

'దమ్ మారో దమ్!.....మిట్ జాయే హమ్.....
బోలో సుభాశామ్.....హరికృష్ణహరెరామ్......'

ఆశాభోస్లే గొంతు కమనీయంగా పలికింది. ఆ పాట వింటూంటే హరిబాబు మనస్సు గతస్మృతుల గతుకుల్లో విహరించసాగింది.

ఈ పాటంటే మంజుకు అసలు గిట్టదు. సభ్యతా, సంస్కారాన్ని మంటగలిపి, జీవితానికి విలువ తగ్గించుకొని మరమనుషుల్లా కృత్రిమ ఆనందంలో మునిగే ఆ హిప్పీ సాహిత్యం ఆమెకు ససేమిరా నచ్చదు. ఒక్కసారిగా గతమంతా, మంజులతో తన అనుభవాలన్నీ హరిబాబు మేధస్సులో తిరిగి స్ఫురణకు వచ్చాయ్.

హరిబాబు చాలా తెలివైనవాడు. తల్లి చిన్నప్పుడే గతించినా తండ్రి సంరక్షణలో సలక్షణంగా పెరిగి ఎం. బి. బి. యస్. వరకు చదివాడు. కుమారుని శ్రద్ధను, అతనిలోని పట్టుదలను గ్రహించిన తండ్రి రాజశేఖరం అతణ్ణి ఇంకా పైకి చదివించా లనుకున్నాడు. ఇందుకు హరిబాబు మేనమామ జగన్నాథంగారి సహకారం ఎంతయినా వుంది. ఆయన అనుక్షణం హరిబాబు ఔన్నత్యం కోసం కృషిచేస్తూ బావగారైన రాజశేఖరం పట్టుదలకు పరిష్టతను చేకూరిస్తూ వచ్చారు.

జగన్నాథంగారు మంచి స్థితిపరులు. నగరంలో పేరుమోసిన పారిశ్రామికవేత్త. ఆయన ఒక్కగానొక్క ముద్దుల కూతురే మంజుల. చిన్నతనంనుంచీ ఆమె ఆడింది ఆటగా, పాడింది పాటగా జరుగుతూవచ్చిందాయింట్లో.

తరచూ తమ ఇంటికి వస్తూ పోతూ వుండే హరిబావంటే చిన్నతనంనుంచీ మంజులలో ఒక విధమైన ఆత్మీయతా భావం హృదయంలో నాటుకుపోయింది. కాలచక్రంలో ఎన్నో సంవత్సరాలు దొర్లిపోతున్నా బావామరదళ్ళ వయస్సులో మార్పువచ్చినా, వారి స్నేహబంధంలో కించిత్తయినా దారుఢ్యంసడలలేదు. పైపెచ్చు అది దిన దినం బలపడుతూవచ్చి చివరకు ఇరువురిలో ప్రేమకు అంకురార్పణకూడా చేసింది.

వయస్సుతోపాటు అజంతా చిత్రంలాంటి సౌందర్యాన్ని సంతరించుకుంటున్న మంజులపై హరిబాబుకు పంచప్రాణాలు.

అలాగే చదువులో అంచెలంచలుగా పైకివెళుతున్న బావపైన విపరీతమైన ప్రేమాభిమానాలు మంజులకు.

వీరిరువురి అనురాగాన్ని పెద్దలెవ్వరు అభ్యంతర పెట్టలేదు, పైగా హర్షించారుకూడా.

ఒక శుభముహూర్తాన ఇరువుర్నీ శాస్త్రోక్తంగా

పంపకాలను చేయాలని ప్రయత్నించారు రాజశేఖరం, జగన్నాథంగార్లు.

ఈ విషయంలో హరిబాబు వారి అభిప్రాయాన్ని అభ్యంతరపెట్టాడు. తన చదువు ముందుగా పూర్తికావాలనీ, ఆ తర్వాతే మా యొక్క వివాహమని నిష్కర్షగా చెప్పేశాడు. మంజులకూడా ఇదే మాట నొక్కి చెప్పడంతో అతని అభీష్టాన్ని వ్యతిరేకించకుండా ఇరువురు పెద్దలు ఒప్పుకొని తలలాడించారు.

కాలక్రమాన హరిబాబు ఎం. బి. బి. ఎస్. పూర్తి చేశాడు. ప్రభుత్వం అతణ్ణి ఉన్నతచదువులకై అమెరికా పంప నిశ్చయించింది. ఈ విషయం తెలిసిన అందరూ సంతోషపరవశులయ్యారు.

ఇక మంజుల ఆనందమైతే వర్ణనాతీతం. తన బావ విదేశాలకు వెళ్ళి గొప్పడాక్టరై తిరిగి వస్తాడనే ఊహ ఆమెను చక్కలిగింతలు పెట్టింది. సంతోషంతో మైమరచి పోయింది.

* * * *

ఆ రోజు!

మంజులా, హరిబాబు ఇరువురు పిక్చరుకు వెళ్ళారు. మర్నాడే హరిబాబు అమెరికా ప్రయాణం. మంజుల మనసంతా అదోలా గుబులుగావుంది. ఏదో తెలియని విషాదం ఆమె వదనంలో ప్రతిఫలించింది. ఆమె పరిస్థితి గ్రహించుకున్న హరిబాబు గంభీరంగా మంజుల భుజం తట్టాడు.

'బాధపడుతున్నావా మంజూ!' అన్నాడు ఆర్తిగా చూస్తూ. మంజుల కంఠం రుద్ధమైంది. కళ్ళలో తిరుగుతున్న కన్నీటిని అతిప్రయత్నంమీద నిగ్రహించుకుంది. 'లేదు బావా! ఏమిటో నువ్వు వెళ్ళిపోతున్నావంటె ఇన్నిరోజుల మన సాంగత్యం మదిలో మెదిలి కాస్త విచారంకలిగింది అంతే!' తేలిగ్గా ఉండటానికి ప్రయత్నిస్తూ అంది.

'పోనీ నాప్రయాణం మానుకోనా' మంజూ థియేటర్లో కూర్చున్నతర్వాత అకస్మాత్తుగా అడిగాడు హరిబాబు.

'వద్దు బావా' తొట్రుపాటుగా అంది మంజుల 'నీ కోసం, నీ ఔన్నత్యంకోసం అందమైన నిరీక్షణలో ఎన్ని యుగాలైనా వేచియుండగలను. అటువంటిది కేవలం రెండేళ్ళకోసం మిమ్మల్ని విడిచియుండలేనా''

'మంజూ' అని ఆప్యాయంగా ఆమె చేయి నొక్కుతూ అన్నాడు హరిబాబు.

ఇంతలో హాలులో లైట్లు ఆరిపోయాయ్. న్యూస్ వగయిరాలన్నీ పూర్తయిన తర్వాత స్క్రీన్ మీద 'హరే రామ హరే కృష్ణ' చిత్రం ప్రారంభమైంది. చిత్రం ఆసక్తిదాయకంగా అనిపించింది హరిబాబుకు.

కాని హీరో చెల్లెలు తన జీవితాన్ని నాశనం చేసుకొని క్లబ్బులో 'దమ్ మారో దమ్' పాట పాడగానే మంజుల అకస్మాత్తుగా సీట్లోంచి లేచి బయటకు నడిచింది.

హరిబాబు ఆశ్చర్యపోయాడు. 'మంజూ' అని పిలుస్తూ తనూ ఆమె వెనకాలే బయటకు నడిచాడు.

'ఏమిటి మంజూ! ఎందుకలా అర్ధాంతరంగా బయటకు వచ్చావ్?' మంజుల భుజంమీద చెయ్యివేస్తూ అన్నాడు.

'ఏమిటో బావా! నాకా పిక్చరు ఏమాత్రం నచ్చలేదు. మన సంస్కృతిని, సంప్రదాయాలను మంటగలిపి, జీవితపు విలువలను అర్ధం చేసుకోకుండా మనుషులు మారిపోయి త్రిశంకుస్వర్గంలో ఊగిసలాడుతూ ఎలా పాడవుతున్నారో చూడు' జుగుప్సగా అంది.

హరిబాబు మందహాసం చేశాడు. 'పిచ్చి మంజూ! జీవితంలో ఎదురు దెబ్బలు తిన్న ప్రతి వ్యక్తి మనశ్శాంతి కోసం, స్వప్నజగత్తునూ, త్రిశంకుస్వర్గాన్ని వాంఛిస్తాడు. ఒకవేళ కొన్ని అవాంఛనీయ సంఘటనలు జరిగితే మన జీవితాలు కూడా అలాగే మలుపు తిరుగవచ్చు' గంభీరంగా అన్నాడు.

'బావా!' వారించింది మంజుల. 'అటువంటి ఆలోచనలు నీ మనసు ఛాయలకుకూడా రానివ్వద్దు. ఒక్కొక్కప్పుడు మన మనసులో ఊహామాత్రంగావున్న యోచనలు ప్రత్యక్షంగా రూపులు దిద్దుకుంటాయ్. ఇక అప్పుడు ఆ అనుభవాల్ని భరించే శక్తి మనలో వుండదు.'

మంజుల మాటలకు సమాధానం చెప్పకుండా ఆలోచిస్తూ వుండిపోయాడు హరిబాబు. ఇరువురూ మౌనంగానే ఇంటికి చేరుకున్నారు.

ఆ మర్నాడే అందరివద్ద వీడ్కోలుతీసుకొని విమానం ఎక్కాడు హరిబాబు. కళ్లలో నీరు సుళ్ళు తిరుగుచుండగా, హృదయంలో ఉద్వేగం పొంగి ప్రవహిస్తుండగా, ఎలాగో బావను సాగనంపింది మంజుల.

ఆ రోజునుండి సరిగ్గా రెండు సంవత్సరాలు అనంతమైన కాలగర్భంలో కలిసిపోయాయ్. మంజుల గురించిన మధుర భావాలు కోటి తరంగాలై మనస్సులో ముప్పిరిగొంటుండగా మద్రాసులో విమానం దిగి ఎక్స్‌ప్రెస్‌లో స్వస్థలం హైదరాబాదు బయలుదేరాడు హరిబాబు.

గతమంతా ఒక్కసారిగా కళ్ళముందు తిరిగిన హరిబాబు ట్రాన్సిస్టర్ చేతిలో పట్టుకొని అలాగే ఉండిపోయాడు.

అదే సమయంలో ట్రైన్ హైదరాబాదు స్టేషనులో మెల్లగా ఆగింది. ఆలోచనల్లోంచి చటుక్కున మేల్కొన్న హరిబాబు గబగబా రేడియో సూట్ కేస్‌లో సర్ది చేత పట్టుకొని క్రిందకు దిగాడు.

ఉత్సాహంగా, శరీరంలో రక్తం పరవళ్లు తొక్కుతుండగా టాక్సీనుండి దిగిన హరిబాబు జగన్నాథం మామయ్య ఇంట్లో అడుగులు మోపాడు.

అతనికి 'మంజూ!' అని ఒక్కసారిగా అరుద్దామనిపించింది, కాని ఎందుకో అలా చేయలేకపోయాడు.

ఇంట్లో ఎవరూ వున్నట్టులేదు కాని లోపలినుంచి ఏదో కోలాహలం విన్పిస్తోంది. 'మామయ్యా' అని పిలుచుకుంటూ లోపలి గదిలో అడుగుపెట్టిన హరిబాబు స్టన్ అయ్యాడు. ఒక్కసారిగా అతని కళ్లు మసక చీకట్లు కమ్మాయ్. తల పగిలిపోతున్నట్టూ, కాళ్ళక్రింది భూమి రెండుగా చీలిపోతున్నట్టూ అపోహపడి ఒక్కసారిగా శరీరంలోని చైతన్యాన్నంతా కూడగట్టుకొని 'మంజూ' అని అరచి సూట్ కేస్ వదలి ద్వారబంధాన్ని గట్టిగా పట్టుకున్నాడు.

ఎదురుగా గదిలో మంజులతోపాటు ఇంకా పది మంది వరకు యువతులున్నారు. అందరూ తన్మయత్వంలో మునిగిపోయి ట్విస్ట్ చేస్తున్నారు. మైకంతో ఊగుతున్నారు. ప్రక్కనే టేబుల్ మీద రికార్డు ప్లెయరులో ప్లేట్ గిరగిరా తిరుగుతోంది.

'దమ్ మారోదమ్..........మిట్ జాయేహమ్' మనిషి మనసును మగత క్రమ్మించే గొంతుతో విన్పిస్తోంది ఆశాభోంస్లె పాడిన గీతం: పాట కనుగుణంగా మంజులా, చుట్టూవున్న అమ్మాయిలూ స్వర్గంలో తేలిపోతున్నట్టుగా ఊగుతున్నారు.

మంజుల అలంకరణ పూర్తిగా మారిపోయింది. అందమైన నాగుబాములాంటి నల్లని జడ బాబ్డ్ హెయిర్ గా మారింది. రంగురంగుల బొమ్మలున్న కమీజూ, చారల బెల్ బాటమ్ పాంటు ధరించింది. నోట్లో కాలుతున్న సిగరెట్ వుంది.

'మంజూ' అన్న అరుపు విన్న మంజుల బృందం ఒకసారిగా తమ జగత్తునుండి బయటకు ఊడిపడ్డారు.... విచిత్రంగా అందరూ ద్వారం వద్దనున్న హరిబాబును చూశారు.

హరిబాబు వైపు తిరిగిన మంజుల నేత్రాలు ఒక్క క్షణం అతన్ని గుర్తించినట్టుగా రెప్పలు టపటపా కొట్టుకున్నాయ్. కాని అది ఒక్క క్షణం మాత్రమే. తర్వాత నిర్లక్ష్యంగా నోట్లోంచి సిగరెట్ ముక్క నేలకేసి విసిరికొట్టి తిరిగి ఎప్పటిలా తన ప్రపంచంలో మునిగిపోయింది.

హరిబాబు విచలితుడై పోయాడు. అతని మెదడు మొద్దుబారి అతన్నొక పిచ్చివానిగా మార్చివేసింది. అచేతనంగా అలానే నిలబడిపోయాడు.

ఇంతలో ఎవరివో బలమైన హస్తం అతని భుజంమీద పడేసరికి ఉలిక్కిపడి వెనుదిరిగాడు. ఎదురుగా అతని మేనమామ జగన్నాథంగారు నిలబడి అతనివైపు జాలిగా చూస్తున్నారు. హరిబాబులో ఒక్కసారిగా వాస్తవం మేల్కొంది.

'మామయ్యా! ఏమిటిదంతా? నా మంజుకేమయింది?' ఆవేదనంగా జగన్నాథంగారి భుజాలు పట్టి కదుపుతూ అన్నాడు.

'అంతా విధివిధానం బాబూ! పద చెపుతాను' అంటూ మేనల్లుని వేరే గదిలోకి తీసుకుపోయి అసలు సంగతి చెప్ప నారంభించాడు.

'చూడు బాబూ! మానవ జీవితాలకు మలుపు సహజం అది మనిషిని ఉన్నత శిఖరాలపై కూర్చుండబెట్టవచ్చు లేదా అథః పాతాళానికి త్రోసివేయవచ్చు. కాని మనమంతా విధిచేతిలో కీలుబొమ్మలమని గుర్తుంచుకోవాలి:

'మంజుల మారిన వైనం నిన్ను ఆశ్చర్యంలో ముంచివేయవచ్చు కాని ఆ పరిస్థితిలో అది అలా మారిపోవడం సహజమేమో అనిపిస్తోంది నాకు.'

ఆరు మాసముల క్రితం ఒకసారి మంజుల వారి కాలేజిలో వేసిన ఒక నాటకంలో పాల్గొంది. నాకేవో అర్జంటు పనులుండటంవల్ల నేనా నాటకం చూడటానికి వెళ్ళలేకపోయాను. వాస్తవంగానే దేవకన్యలాంటి అందంతో మెరిసిపోయె అమ్మాయి మేకప్‌తో స్టేజిమీదకు వచ్చేసరికి అందరి కళ్ళూ జిగేలుమన్నాయ్. ప్రేక్షకుల హృదయాలు పట్టుదప్పి పోయాయ్. అందుకు తోడు ఆనాడు మంజుల వేసిన పాత్ర శకుంతల.

నిజంగా ఆలనాటి శకుంతలేనేమో ననే భ్రమను ప్రేక్షకుల్లో కల్గించింది అమ్మాయి.

నాటకం పూర్తయింది ప్రేక్షకులంతా వెళ్ళిపోయారు. అప్పటికే చాలా రాత్రయింది. కారులో ఇంటికి తిరిగి వస్తోంది మంజుల, ఇంతలో......' చెప్పడం ఆపి భుజంమీది పంచెతో కన్నీళ్లు తుడుచుకున్నాడు జగన్నాథం. ఆయన పితృ హృదయం వేదనతో తల్లడిల్లిపోయింది.

హరిబాబు దీక్షగా వింటున్నాడు, అతని ముఖంలో మాటలకందని భావమేదో వాడిగా కదలాడుతోంది.

'ఇంతలో!' తిరిగి ప్రారంభించారాయన 'మార్గమధ్యలో అర్ధరాత్రి కావడంవల్ల నల్గురు కాలేజి విద్యార్థులు

భలవంతంగా కారు నాపుజేసి డ్రైవర్‌ను గాయపరచి మంజుల నెత్తుకు పోయారు.

ఆ తర్వాత .....ఆ తర్వాత వారందరూ తమ... పశువాంఛకు నా చిట్టి తల్లిని బలవంతంగా 'బలిచేశారు బాబూ!' చెప్పలేక చెప్తూ బావురుమన్నాడు జగన్నాథంగారు.

వింటున్న హరిబాబు మౌనంగా వుండిపోయాడు, అతని హృదయం మూగగా రోదిస్తోంది. చాలా ఎత్తు నుండి ఎగురుతున్న విమానం కూలి సముద్రంలో పడబోతుంటె ఆరాటంతో విలవిలలాడుతున్న ప్రయాణికుడిలా వుందతని వదనం.

కొద్ది సేపటికి జగన్నాథంగారు కోలుకున్నారు 'బాబూ' దుఃఖం దిగమ్రింగి అన్నాడు ఆనాటినుంచి మంజుల మనస్తత్వంలో మార్పు వచ్చింది. కొన్నిరోజుల వరకూ మనిషే కాలేక పోయింది. 'బావా' అంటూ హృదయం కలిచివేసేలా కలవరించేది. కాని అకస్మాత్తుగా ఏదో గుర్తుకువచ్చినట్లుగా అమాంతం మారిపోయి ఇలా తయారైంది. దాని ప్రపంచమే వేరు. ఇక అది మనుషుల్లో పడటం అసంభవం నాయనా! జగన్నాథంగారు తిరిగి దుఃఖాతిశయంచే నోట్లో పంచ కుక్కుకుంటూ దుఃఖ ప్రవాహాన్ని ఆపడానికి విశ్వప్రయత్నం చేస్తూ బయటకు వెళ్ళిపోయాడు.

హరిబాబు బొమ్మలా గదిలో కూర్చుండి పోయాడు. 'దమ్‌మారోదమ్'... రకరకాలుగా ఆ పాట గదిలో ప్రతిధ్వనిస్తూ అతని కర్ణపుటాలను తాకుతోంది.

ఒకసారిగా రెండు చెవులు మూసుకున్నాడు.

హరిబాబు మస్తిష్కం గతంలో పయనించి ఆనాటి సినిమా థియేటర్‌లోని స్మృతులచుట్టూ తిరుగాడు సాగింది.

'దమ్‌మారోదమ్ .......మిట్ జాయేహమ్' రికార్డు ప్లేయర్ మీద రికార్డు గిరగిరా తిరుగుతోంది.

వినుగూ, విరామం లేకుండా।

బాధ్యత తెలియకుండా॥

'కథాంజలిలో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులు కాదు. —సంపాదకుడు

# రచయితలకు మనవి

—(•)—

యధారీతిగా జూన్ నెల 10 వ తేదీన 'కథాంజలి' జన్మదిన సంచిక వెలువడుతుందని ప్రకటించడానికి సంతోషిస్తున్నాను. ప్రతి ప్రత్యేక సంచిక ఆకర్షణీయమైన రూపంతో మీ ముందు సాక్షాత్కరిస్తున్న సంగతి మీకు తెలియంది కాదు.

పాఠకుల హృదయాలను చూరగొనాలనే ఆకాంక్షతో ఈ జన్మదిన సంచికను సర్వాంగ సుందరంగా బయటికి తీసుకుని రాదలచాను. దీనికి సంబంధించిన పనికూడ ప్రారంభమయింది.

నా ప్రయత్నానికి అమూల్యమయిన రచయితల ప్రోత్సాహం అవశ్యం కావలసి ఉంటుందని నేను యిక్కడ వేరే చెప్పనక్కర్లేదు. చక్కని కథలతోపాటు రాజకీయ, ఆర్థిక, సాంఘిక, చారిత్రక విషయాలమీద వైజ్ఞానిక కాంతులను ప్రసరించే వ్యాసాలను క్లుప్తంగా వ్రాసి రచయితలు 25-4-74 తేదీ లోపల అందజేయాలని మనవి. ఏ పరిస్థితులలోను ఈ వ్యాసాలు అచ్చులో మూడు పుటలకు మించకూడదు.

జన్మదిన సంచిక పని ప్రారంభమయిందని మరొకసారి రచయితలకు మనవి చేస్తున్నాను. వెంటనే వారు తమ వ్యాసాలను పంపి 'కథాంజలి' యొక్క ముందడుగుకు దోహదం చేయాలని మరొకసారి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఎ. ఎన్. రాఘవాచారి,

సంపాదకుడు.